సాక్షి 24/7
తూర్పుగోదావరి
శనివారం 29-12-2018

# వ్యవస్థలో మార్పుతోనే నాణ్యమైన విద్య

- ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఉదయభాస్కర్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వ్యవస్థలో మార్పు తీసుకురాగలిగితేనే నాణ్యమైన విద్యను అందించడం సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉదయ భాస్కర్ అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ(జేఎన్‌టీయూకే) ఆవిర్భవించి పదేళ్ళ పూర్తి చేసుకున్న సందర్భంగా జేఎన్‌టీయూకే ప్రాంగణంలోని అలూమ్ని ఆడిటోరియంలో శుక్రవారం దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉదయభాస్కర్ హాజరయ్యారు. కార్యక్రమానికి ఉపకులపతి ఎం.రామలింగరాజు అధ్యక్షత వహించగా, గౌరవ అతిథులుగా రెక్టార్ ఐ.శాంతిప్రభ, రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు, ఓఎస్‌డీ వి.రవీంద్రనాథ్ వేదికనలంకరించారు. దశాబ్ది ఉత్సవాలను అతిథులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ముఖ్య అతిథిగా హాజరైన పి.ఉదయభాస్కర్ మాట్లాడుతూ తాను చదువుకుని, ఉద్యోగం చేసిన యూనివర్సిటీ వేడుకలకు ముఖ్య అతిథిగా రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇంజినీరింగ్ విద్యలో నాణ్యతను పెంచేందుకు, నైపుణ్యాల శిక్షణపై గురి పెట్టాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్నారని, అందువల్లనే పోటీ పరీక్షలైన గ్రూప్–1లో తెలుగును తప్పనిసరి చేసినట్టు చెప్పారు. సుమారు 85 శాతం విద్యార్థులు పరిశ్రమలకు అనుగుణంగా పనిచేసే నైపుణ్యం లేదని, దీనిని అధిగమించేందుకు అధ్యాపకుల తోడ్పాటుతో పలు సంస్కరణలు చేపట్టాలన్నారు.

ఉపకులపతి ఎం.రామలింగరాజు మాట్లాడుతూ ఇదే విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా, అధ్యాపకుడిగా, డైరెక్టర్‌గా, ఉపకులపతిగా సేవలందించడం తన అదృష్టమన్నారు. మొట్టమొదటి ఉపకులపతి అల్లం అప్పారావు హయాంలో యూజీసీ నుంచి 12బీ స్టేటస్‌ను తీసుకురాగా, రెండో ఉపకులపతి జి.తులసీరాందాస్ హయాంలో జేఎన్‌టీయూ విజయనగరం కళాశాల ఏర్పాటు, జేఎన్‌టీయూకేలో మౌలిక సదుపాయాలు, భవనాల నిర్మాణాలపై దృష్టిసారించగా, మూడో ఉపకులపతి వీఎస్ఎస్ కుమార్ హయాంలో జేఎన్‌టీయూ నరసారావుపేట కళాశాల ఏర్పాటు, ఇంక్యుబేషన్, రీసెర్చ్ ఇన్నోవేషన్ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను అభివృద్ధి పరిచారన్నారు. ప్రస్తుతం తాను పరిపాలన పచ్చదనం, స్మార్ట్‌క్యాంపస్, రీసెర్చ్‌కల్చర్, స్టార్టప్స్, ఇంక్యుబేషన్, పారదర్శక పరిపాలన, అనుబంధ కళాశాలల్లో మౌలిక సదుపాయాల పెంపు రీసెర్చ్ సెంటర్లను నెలకొల్పేలా కృషి చేశానని చెప్పారు.

రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు మాట్లాడుతూ జేఎన్‌టీయూకే విద్యార్థులు ఎందరో ఉన్నతమైన స్థానాల్లో ఉంటూ దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేశారన్నారు. యూనివర్సిటీలోని అన్ని విభాగాలలో కాగిత రహిత ప్రక్రియలను అనుసరిస్తున్నామన్నారు. జేఎన్‌టీయూకే విజయాలతో కూడిన సంచికను సీడీ రూపంలో ముఖ్యఅతిథులు విడుదల చేశారు. ముఖ్యఅతిథిని, మాజీ ఉపకులపతులను, విద్యావేత్తలను, రిటైర్డ్ ఉద్యోగులను శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. అనంతరం జరిగిన ప్లీనరీ సెషన్స్‌లో మాజీ ఉపకులపతులు, విద్యావేత్తలు, ఐఐటీ, ఎన్ఐటీ మాజీ ప్రొఫెసర్లు, నిపుణులు పాల్గొని అవుట్ కమ్‌బేస్డ్ ఎడ్యుకేషన్ విధివిధానాలపై సుదీర్ఘంగా చర్చించారు. తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు అంశాల్లో విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకలకు మాజీ ఉపకులపతులు అల్లం అప్పారావు, వీఎస్ఎస్ కుమార్, యూనివర్సిటీ అధికారులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, పూర్వవిద్యార్థులు, అనుబంధ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్



జేఎన్‌టీయూకే అభివృద్ధి కార్యక్రమాలతో రూపొందించిన సీడీని ఆవిష్కరిస్తున్న ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్, ఎం.రామలింగరాజు తదితరులు


రయ్.. రయ్ : ఓ విద్యార్థిని బైక్ రైడింగ్








జేఎన్‌టీయూకే దశాబ్ది ఉత్సవాల ప్రారంభం సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు